
సాక్షి
ఒడిశా

శనివారం । 2। మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.2,29,165
బంగారం 32 గ్రాములు 650 మిల్లీ గ్రాములు
వెండి 31 గ్రాములు 100 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



బస్ టెర్మినల్ ప్రారంభం

స్థానిక బరముండా ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబేడ్కర్ బస్ టెర్మినల్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.

– IIలో▸



దివ్యాంగులకు ప్రభుత్వం తోడ్పాటు

దివ్యాంగులకు ప్రభుత్వం అన్నివిధాల తోడ్పాటునందిస్తోందని పర్లాకిమిడి కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు.

– IIలో▸

బీజేడీకి షాక్..!

- బీజేపీలోకి జగన్నాథ్ నుండ్రుక
- బిసంకటక్ నుంచి పోటీచేసే అవకాశం



బీజేపీ నాయకులతో జగన్నాథ్ నుండ్రుక

రాయగడ: జిల్లాలో అధికార బీజేడీకి గట్టి షాక్ తగిలింది. పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీ విజయానికి ఎంతగానో కృషి చేస్తూ వస్తున్న సీనియర్ నాయకుడు, ప్రత్యేక అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు జగన్నాథ్ నుండ్రుక శుక్రవారం బీజేపీలో చేరారు. రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ రాష్ట్ర పరిశీలకుడు బిజయ్ సింగ్ తోమర్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు ఉమా శంకర్ ఉలక తదితరులు పాల్గొన్నారు. 2002లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నుండ్రుక బీజేడీలో క్రియాశీలక సభ్యుడిగా కొనసాగారు. సర్పంచ్‌గా రెండుసార్లు, ఎస్‌డీసీ చైర్మన్‌గా ఒకసారి తన సేవలు అందించారు. అయితే నుండ్రుక బీజేపీలో చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో ఒక్కసారిగా ఫొటోలు వైరల్ కావడంతో బీజేడీ నాయకులు ఖంగుతిన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నుండ్రుక బీజేపీలో చేరిన విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

టిక్కెట్టు ఆశించి భంగపడడంతోనే..?

జిల్లాలో మూడు శాసనసభ స్థానాలు ఉన్నాయి. వాటిలో బిసంకటక్ నియోజకవర్గం నుంచి ఈసారి బీజేడీ పార్టీ టిక్కెట్టుపై పోటీ చేసేందుకు నుండ్రుక ఆసక్తి కనబరిచారు. అయితే ఇదే నియోజకవర్గం నుంచి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రి జగన్నాథ సరకకు కొరాపుట్ లోక్‌సభ టిక్కెట్టు ఇచ్చి, నుండ్రుకకు బిసంకటక్ ఎమ్మెల్యే టిక్కెట్టు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. కానీ టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తున్న నుండ్రుకకు అధిష్టానం మొండిచేయి చూపడంతోనే భంగపడి గత్యంతరం లేక బీజేపీలో చేరినట్లు వార్తలు వస్తున్నాయి.

పోటీ రసవత్తరం

బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని రఘుబారి, దిమిరిగుడ, పాత అంబొదల, ఇచ్చాపూర్, జగదల్‌పూర్ వంటి ప్రాంతాల్లో నుండ్రుకకు మంచిపట్టు ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు బీజేడీ టిక్కెట్టు కేటాయిస్తే విజయం సునాయాసంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావించారు. కానీ ఈ స్థానంలో మరలా మంత్రి సరకకే అధికార పార్టీ టిక్కెట్టు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో కొద్దికాలంగా అసంతృప్తి సెగలు వ్యాపిస్తున్నాయి. అలాగే కార్యకర్తలు కూడా ఆయన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నుండ్రుక బీజేపీ నుంచి పోటీ చేస్తే రాజకీయం రసవత్తరంగా మారుతుంది.

నెక్కంటితో విభేదాలు

బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, మంత్రి సరకలు బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటితో గత కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. దీంతో ఒకే పార్టీలో వేరు వర్గంగా ఉంటున్నారు. నెక్కంటి ఆశీర్వాదంతో మంత్రి పదవి సాధించిన సరక, అదేవిధంగా రాజకీయాల్లో ఎదిగిన సుధీర్ దాస్‌లు ప్రస్తుతం నెక్కంటికి రాజకీయ శత్రువులుగా మారారు. జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభల్లో బీజేడీ టిక్కెట్టు పొందాలంటే నెక్కంటి మాట తప్పనిసరి అన్నది అక్షర సత్యం. గత మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో రాయగడ ప్రాంతాన్ని అధిష్టానం నెక్కంటికి బాధ్యతలు అప్పగిస్తే, గుణుపూర్, బిసంకటక్ ప్రాంతాలను పర్యవేక్షించేందుకు సరక, సుధీర్ దాస్‌లకు అధిష్టానం బాధ్యతలు ఇచ్చింది. అయితే గుణుపూర్, బిసంకటక్‌లలో బీజేడీ ఘోర పరాజయం పొందగా, రాయగడలో నెక్కంటి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మున్సిపాలిటీతో పాటు పంచాయతీ ఎన్నికల్లో సైతం మంచి ఫలితాలను సాధించింది. ఈ నేపథ్యంలో రాయగడ జిల్లాలో అధికార పార్టీలో ఏం జరుగుతుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

9 మంది ఓఏఎస్ అధికారులు బదిలీ

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 9 మంది ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఓఏఎస్) అధికారులను బదిలీ చేసింది. సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు ఉత్తర్వులు శుక్రవారం జారీ చేసింది. మూడు సంవత్సరాలు పనిచేసిన తర్వాత ఒక జిల్లా నుంచి బదిలీ చేయబడిన అధికారులను అదే పార్లమెంటరీ నియోజకవర్గంలోని మరొక జిల్లాలో పోస్టింగ్ చేయకుండా బదిలీ చేసి నియామకాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ అధికారుల బదిలీ ఉత్తర్వులు జారీ అవుతున్నాయి. భద్రక్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సుచారు కుమార్ బొలా సంబల్‌పూర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు. సంబల్‌పూర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంబిత్ కుమార్ గొడొనాయక్ భద్రక్ అదనపు జిల్లా మేజిస్ట్రేటుగా నియమితులయ్యారు. ఝార్సుగుడ పీడీ (ఆర్‌అండ్‌ఆర్) అలోమణి సెఠిని బదిలీ చేసి, కొరాపుట్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా నియమించారు. ఈ స్థానంలో ఇంతవరకు బాధ్యతలు నిర్వహించిన ప్రసన్నకుమార్ పాత్రో గంజాం ఆర్‌ఐసీ జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. బాలాసోర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్, సీడీఏ కార్యదర్శి ప్రియదర్శిని మల్లిక్ ఎఫ్‌అండ్‌ఏఆర్‌డీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. పర్లాకిమిడి ఐటీడీఏ పీఏ, రాయగడ జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి ఫల్గుణి మార్ఝీ కెంజొహర్ ఆనందపూర్ సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన చిత్తరంజన్ మహంతాని బదిలీ చేసి కందమాల్ జిల్లా సబ్ కలెక్టర్‌గా నియమించారు. అస్కా కో–ఆపరేటివ్ షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇడ్కో ల్యాండ్ ఆఫీసర్‌గా ఉమ్మడి బాధ్యతలు నిర్వహిస్తున్న గాయత్రీ దత్తా నాయక్ అస్కా కో–ఆపరేటివ్ షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగడానికి అనుమతించారు. గంజాం జిల్లా బరంపురం సీడీఎం కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కంధమల్ జిల్లా సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుబ్రత్ కుమార్ జెనా బరంపురం సీడీఎం కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా మాత్రమే కొనసాగుతారు.

నదిలో మునిగి ఇద్దరు బాలికలు మృతి



అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసిన హేమవతి మృతదేహం

రాయగడ: నాగావళికి నదికి స్నానం కోసం వెళ్లి దురదృష్టవశాత్తు మునిగిపోవడంతో ఊపిరాడక ఇద్దరు బాలికలు మృతి చెందిన ఘటన సనో చందిలి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతులు గ్రామానికి చెందిన అను అబ్దుల్ (10), హేమావతి సునా(11)లుగా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఆ ప్రాంత యువకులు రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాలను వెలికితీశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అను, హేమాలు శుక్రవారం స్కూల్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో స్నానానికి వెళ్తున్నామని చెప్పి సమీపంలోని నాగావళి నదికి వెళ్లారు. ఇద్దరు నదిలో దిగి స్నానం చేస్తుండగా మరికొంత లోపలికి వెళ్లడంతో మునిగిపోయారు. కొద్దిసేపటికి నదిలో బాలికలు గల్లంతయ్యారని తెసుకుని కుటుంబ సభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ క్రమంలో గ్రామంలోని కొంతమంది యువకులు నదిలో అను అనే బాలికను బయటకు తీశారు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇదిలాఉండగా నదిలో ఆచూకీ లభించని హేమావతిని అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటుగా శ్రమించి బయటకు తీకొచ్చారు. అయితే అప్పటికే ఆమె కూడా మృతి చెందడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రత్న భాండాగారం పరిశీలన కమిటీ ఏర్పాటు

- అధ్యక్షుడిగా జస్టిస్ అరిజిత్ పసాయత్



జస్టిస్ అరిజిత్ పసాయత్



డాక్టర్ రమాకాంత పండా

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారం (ఖజానా)లో నిల్వ చేసిన విలువైన ఆభరణాలు, వస్తువుల జాబితాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్‌ని అధ్యక్షునిగా నియమించింది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కమిటీ ఏర్పాటు కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీమందిరం పాలక మండలి సంప్రదించిన 60 రోజుల్లోపు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని హైకోర్టు నాలుగు నెలల క్రితం ఆదేశించింది. ఈ ఆదేశాల ప్రకారం శ్రీజగన్నాథ ఆలయ మేనేజింగ్ కమిటీ (ఎస్‌జేఎంసీ) సంప్రదింపు పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ అరిజిత్ పసాయత్ అధ్యక్షతన 12 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 12వ శతాబ్దపు శ్రీమందిరం ఖజానాలోని శ్రీజగన్నాథుని అమూల్య ఆభరణాలు, ఇతరేతర విలువైన వస్తువుల జాబితా ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. ప్రఖ్యాత హృద్రోగ నిపుణుడు డాక్టర్ రమాకాంత పండా ఈ కమిటీకి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇతర సభ్యుల్లో బిధుభూషణ్ సామల్ (అలహాబాద్ బ్యాంక్ మాజీ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్), ఎ.కె.సాబత్ (చార్టర్డ్ అకౌంటెంట్), పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ ప్రతినిధి, భారత పురావస్తు శాఖ ప్రతినిధి, దుర్గా ప్రసాద్ దాస్ మహాపాత్రో (సేవాయత్), మాధవ్ చంద్ర మహాపాత్రో (సేవాయత్), జగన్నాథ్ కొరా (సేవాయత్), గణేష్ మేకప్ (సేవాయత్), పూరీ జిల్లా కలెక్టర్, శ్రీజగన్నాథ ఆలయ ప్రధాన పాలన అధికారి (సీఏవో) ఉన్నారు. శ్రీ జగన్నాథ ఆలయం పాలక అథారిటీ (ఎస్‌జేటీఏ) కమిటీ మెంబర్ – కన్వీనర్‌గా వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఏఎస్‌ఐకి హస్తలిపి గ్రంథాలు అప్పగింత



ఏఎస్‌ఐకి కస్టమ్స్ అధికారులు అప్పగించిన అరుదైన హస్తలిపి తాళపత్రాలు

భువనేశ్వర్: స్థానిక కస్టమ్స్ వర్గాలు ఇదివరకు స్వాధీనం చేసుకున్న ప్రాచీన అరుదైన తాళపత్రాలు, చేతితో రాసిన రాత ప్రతులను ఇక్కడి భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)కి శుక్రవారం అప్పగించారు. వీటిని స్పీడ్ పోస్టు ద్వారా స్పెయిన్, ఫ్రాన్స్‌లకు అక్రమంగా తరలిస్తున్నట్లు 2019 అక్టోబర్‌లో భువనేశ్వర్ కస్టమ్స్ అధికారులు గుర్తించారు. 155 తాళపత్ర, చేతిరాత ప్రతులు పోస్టల్ ద్వారా పంపిస్తున్నట్లు కనుగొన్నారు. ఈ ప్రతులు ఒడియా లిపి, భాషలో రాయబడి ఉన్నాయి. ఈ రాతల్లో శ్రీమద్ భగవత్ మహా పురాణంలోని 10వ అధ్యాయం ఉన్నట్లు తేలింది. శాస్త్రీయ చంపు లిపితో ఈ రాతలు రాసినట్లు భావిస్తున్నారు. ఈ ప్రతుల్లో రాతలు ఉభయ గద్య (గద్య–కావ్య), పద్య భాగాల (పద్య–కావ్య) మిశ్రమ భారతీయ సాహిత్యంతో నిండి ఉంది. తాళపత్ర రాత ప్రతులు 300 సంవత్సరాల ప్రాచీనమైనవిగా ప్రాథమిక అంచనా.

ఇదీ విషయం..

పూరీకి చెందిన కిరణ్ పాయ్ అనే వ్యక్తి 2019వ సంవత్సరం అక్టోబర్ 10న ఈ అమూల్య తాళ ప్రతులకు స్పీడ్ పోస్టును బుక్ చేశాడు. తనిఖీ, క్లియరెన్స్ కోసం స్థానిక కస్టమ్స్ ఫారిన్ పోస్టాఫీసుకు ఈ పోస్టల్ ప్రతులు అందడంతో గుర్తించిన కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. అలాగే 2020 సంవత్సరం అక్టోబర్‌లో భువనేశ్వర్ కస్టమ్స్ ద్వారా నిలిపివేయబడిన మరో పోస్టల్ వ్యవహారంలో మరో చేతి రాత ప్రాచీన గ్రంథాలను గుర్తించారు. వీటిలో దేవనగరి లిపిలో రాసిన 17 తాళపత్ర ప్రతులను గుర్తించారు. ఈ ప్రతులు ఫ్రాన్స్‌కు పోస్టల్ ద్వారా బట్వాడా అవుతున్నట్లు తేలింది. ఈ రాతల్లో బౌద్ధ గ్రంథాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ సాహిత్యం సుమారు 80 ఏళ్ల పైబడినదిగా అంచనా. 2020 సంవత్సరం అక్టోబర్ 24న గజపతి జిల్లాకు చెందిన టామ్‌డిన్ గ్యాల్పో బుక్ చేసిన ఈ కొరియర్‌ను ఫారిన్ పోస్టాఫీసు అధికారులు తమ అధీనంలో ఉంచుకున్నారు. కస్టమ్స్ భువనేశ్వర్ జోన్‌కు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్, సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ (భువనేశ్వర్ సర్కిల్) సుశాంత్ కుమార్ కొరొకు హస్త లిపి ప్రతులను అందజేశారు. ఇదిలా ఉండగా బెంగుళూరు, భోపాల్, భువనేశ్వర్, ఢిల్లీ, గౌహతి, ముంబై, పూణే 7 వేర్వేరు ప్రదేశాలలో స్వాధీనం చేసుకున్న 101 పురాతన వస్తువులను భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)కి అప్పగించే ప్రక్రియని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

- యువత ఆదర్శవంతంగా మారాలి
- దేశ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలి
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



వేదికపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ రఘుబర్ దాస్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వీసీ గీతాంజలి దాస్ తదితరులు



రాష్ట్రపతికి మొమెంటో అందజేస్తున్న వీసీ గీతాంజలి దాస్

బరంపురం: ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. స్థానిక బంజ విహార్‌లోని బిజూ పట్నాయక్ ఆడిటోరియం ప్రాంగణంలో రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ రఘుబర్ దాస్ అధ్యక్షతన బరంపురం విశ్వ విద్యాలయం 25వ స్నాతకోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే దక్షిణ ఒడిశాకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. దక్షిణ ఒడిశా సాంప్రదాయం, సంస్కృతి, కవులు, కళలు, నటక, సంగీత, సాహిత్యాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. దక్షిణ ఒడిశాలో విద్యాభివృద్ధికి బరంపురం విశ్వ విద్యాలయం ఏర్పాటైందని గుర్తు చేశారు. ఈ వర్సిటీ ఎంతో మంది మేధావులను తీర్చిదిద్దిందని కొనియాడారు. యువత క్రమశిక్షణతో విద్యనభ్యసించి దేశ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉన్నత శిఖరాలు అధిరోహించి ఎంతోమందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న అధికారులు, నాయకులు, విద్యార్థులు



మాట్లాడుతున్న గవర్నర్, ఛాన్సలర్ రఘుబర్ దాస్

ప్రపంచ దేశాలతో పోటీ

వర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ రఘుబర్ దాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడుతోందని తెలియజేశారు. విద్యార్థులు మేధావులు, మహా పురుషులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు యూజీసీ నిధులతో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం విద్యార్థులకు రాష్ట్రపతి చేతులమీదుగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



విజయ్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

ఎంవీ 3 గ్రామానికి చెందిన విజయ్ ముర్మ(46) శుక్రవారం ఉదయం పని నిమిత్తం మల్కన్‌గిరి మార్కెట్‌కి వచ్చాడు. అతను తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒక బైక్ ఢీకొనడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వస్తున్న పోలీసు వ్యాన్ వెనుక చక్రం అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ మృతి చెందాడు. దీంతో ఆయన సోదరుడు రాజేస్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి విజయ్ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో జిల్లా పోలీసులు పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

న్యూస్‌రీల్

అత్యాచార నిందితుడు అరెస్టు



నిందితుడు దీపక్

జయపురం: కోట్‌పాడ్‌లో 6 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు కోట్‌పాడ్ సమితి శౌశాహండి గ్రామానికి చెందిన దీపక్ హరిజన్(22)గా పోలీసు అధికారి అణిత కుజూర్ శుక్రవారం వెల్లడించారు. అతడిని కోర్టులో హాజరుపరచి, జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

5వ తేదీ నుంచి విమాన సేవలు



విమానాశ్రయం పరిశీలిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా ప్రజలకు అధికారులు శుభవార్త తెలియజేశారు. ఈనెల 5వ తేదీ నుంచి స్థానిక విమానాశ్రయం నుంచి విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ఇండియా వన్ ఎయిర్ ఫ్లైట్ ఆఫీసర్‌లు రన్‌వైపై ట్రయిల్ వేశారు. విమానాశ్రయం, టెర్మినల్‌ను ఉన్నతాధికారులు పరిశీలించారు.

30 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో అరెస్టైన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పోలీసులు గోవిందపల్లి ఘాటీ వద్ద గురువారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో చిత్రకొండ వైపునుంచి అతి వేగంగా వస్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేశారు. దీంతో కారులో 30 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని కేరళ రాష్ట్రానికి తరలించేందుకు చిత్రకొండలో కొనుగోలు చేసినట్లు కేరళకు చెందిన కె.ఇర్షాద్, బినోద్, చిత్రకొండ సమితి నూవగూడ గ్రామానికి చెందిన ఖర్ ఖీలో, బాబులు తెలియజేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వీరిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, ఆధార్ కార్డులు, రూ.1,590 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



నాటుసారా తయారీ కేంద్రంపై దాడులు చేస్తున్న అధికారులు

రాయగడ: నదీతీర ప్రాంతాల్లో అక్రమంగా సారా తయారు చేస్తున్న కేంద్రాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని పలు గ్రామాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో 70 లీటర్ల నాటుసారాతో పాటు మరో 800 లీటర్ల సారా తయారీకి వినియోగించే ఊటను ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడుల సమయంలో తయారు చేసే వాళ్లు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి



ప్రసంగిస్తున్న జన్మాజయ్ స్వయి

రాయగడ: పట్టణంలో పలు సమస్యలకు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జన్మాజయ్ స్వయి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ కర్ణాటక రాష్ట్ర పరిశీలకుడు నిత్యానంద సాహు, గంజాం జిల్లా ఆప్ పార్టీ అధ్యక్షుడు శుభాష్ రౌత్, కార్యదర్శి ఆదిత్య రౌథొ, హరప్రసాద్ సాహు, కటక్ జిల్లా ఆప్ అధ్యక్షుడు దుర్గా పొరిడా, బలంగీర్ జిల్లా అధ్యక్షుడు ఆశీష్ పాండే తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వయ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. అభివృద్ధి పేరిట అధికారులు నిధులను స్వాహా చేస్తున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను రూ.2,500లకు పెంచాలని, అదేవిధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని వినియోగదారులకు అందించాలన్నారు. ఇదిలాఉండగా ఏళ్ల తరబడి నివాసాలు ఉంటున్న వారికి పునరావాసం కల్పించకుండా ఆక్రమణల పేరుతో ఇళ్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఆరోగ్య శాఖకు జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధులు

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన జాతీయ జన్మ లోపాల అవగాహన కార్యక్రమంలో ఈ పురస్కారం రాష్ట్రానికి ప్రదానం చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది. పిల్లల్లో అత్యధిక సంఖ్యలో పుట్టుకతో వచ్చే లోపాల కేసులను గుర్తించి విజయవంతంగా చికిత్స చేసినందుకు ఒడిశాకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాన్ని ముందస్తుగా గుర్తించడాన్ని బలోపేతం చేయడానికి భారత ఆరోగ్య శాఖ ఈ అవగాహన కార్యక్రమం చేపడుతుంది. పుట్టబోయే పిల్లల ఆరోగ్యకరమైన మనుగడ కోసం సకాలంలో జోక్యం కల్పించుకోవడంలో ఆరోగ్య కార్యకర్తలను ప్రేరేపించేందుకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు.

31 మందికి నియామక పత్రాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పశు సంవర్ధక శాఖలో సచివాలయ పరిధిలోగల పశుసంవర్ధక సహాయకులుగా (ఏహెచ్ఏ) 31మంది ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం ఆ శాఖ జేడీ కిశోర్ నియామక పత్రాలు అందించారు. ఏపీపీఎస్ ద్వారా గత ఏడాది డిసెంబర్ 31న నిర్వహించిన పరీక్షకు 1401 మంది హాజరయ్యారు. వీరిలో రోస్టర్, రిజర్వేషన్ కేటగిరీ ప్రాతిపదికన నియమించారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా నియామక పత్రాలు అందించారు. వీరంతా రెండు మూడు రోజుల్లో ఎవరికి కేటాయించిన స్థానాల్లో వారు విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 381 మంది ఉండగా కొత్తగా ఉద్యోగం పొందినవారితో కలుపుకొని 412మంది ఏహెచ్ఏలుగా విధులు నిర్వహించి పాడి రైతులకు సేవలు అందించనున్నారు.

భవిత పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



స్థానిక భవిత కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ టీమ్ సభ్యులు

నరసన్నపేట: భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలపై మరింత శ్రద్ధ పెట్టాలని స్టేట్ మానిటరింగ్ టీమ్ సభ్యులు ఎస్.అమ్మినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత పిల్లల కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర టీమ్ పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఐఈడీ కోఆర్డినేటర్లకు పలు సూచనలు చేశారు. వీరి వెంట జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ బి.గోవిందరావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి. ఉమ, నరసన్నపేట ఎంఈఓ శాంతారావు, స్కూల్ హెచ్ఎం వెంకటరావులు ఉన్నారు.

రైస్ మిల్లులో చోరీ

సారవకోట: మండలంలోని చీడిపూడి శ్రీ వెంకటేశ్వర మోడ్రన్ రైస్ మిల్లులో గురువారం రాత్రి 1 గంట సమయంలో చోరీ జరిగింది. ఈ దొంగతనంలో రూ.1.30 లక్షలు దొంగిలించారని మిల్లు యజమాని వారణాశి సర్వేశ్వరరావు తెలిపారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మిల్లు ఆవరణలో నైట్ వాచ్‌మెన్ వెంకయ్య రోజూ నిద్రపోతారు. గురువారం రాత్రి కూడా ఆయన నిద్ర పోతుండగా ముఖాలకు గుడ్డలు చుట్టుకుని నలుగురు దుండగులు వచ్చి మొదటి లైట్ ఆఫ్ చేశారు. నిద్రలో ఉన్న వెంకయ్యకు మెలకువ రావడంతో ఎవరంటూ ప్రశ్నించారు. దీంతో వారు కత్తిని అతని మెడ మీద పెట్టి బెదిరించారు. అనంతరం వారు మిల్లు ఆఫీసు గది తాళాన్ని పగుల గొట్టి తొలుత సీసీ కెమెరాల డీవీఆర్ ధ్వంసం చేశారు. అనంతరం బెంచీ డ్రాయర్‌లో ఉన్న రూ 1.30 లక్షల నగదును, సీసీ కెమెరాల డీవీఆర్‌ను తీసుకుని పక్కనున్న పొలాల గుండా వెళ్లిపోయారు. వారు వెళ్లాక వెంకయ్య మిల్లు గుమస్తా కర్జం వీరయ్య ఇంటికి వెళ్లి జరిగినదంతా చెప్పారు. దీంతో ఆయన యజమానికి సమాచారం అందజేశారు. ఆయన సారవకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. జలుమూరు, సారవకోట ఎస్ఐలు మధుసూధనరావు, అప్పారావులతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, నేర విభాగం సిబ్బంది హాజరై దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్, టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, సీసీఎస్ ఎస్ఐ సూరిబాబులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బుడితిలోనూ..

రైస్ మిల్లులో చోరీకి పాల్పడిన దుండగులు తొలుత బుడితి గ్రామంలో ఉన్న నాలుగు దేవాలయాల్లో చోరీకి విఫలయత్నం చేశారు. షిర్డీ సాయి మందిరంలో ఉన్న హుండీని తీసుకుని పొలాల్లో పడేశారు. అయితే ఈ హుండీలో ఎలాంటి డబ్బులు లేనట్లు ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ తెలిపారు. అలాగే అయ్యప్ప స్వామి ఆలయ స్టోర్ రూం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల గేట్లు సైతం పగులగొట్టారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాల డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు.

దివ్యాంగులకు ప్రభుత్వం తోడ్పాటు



కొరాపుట్: వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



కొరాపుట్: దివ్యాంగ దంపతులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏడీఎం రాజేంద్ర మఝి



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న ముదులి, పాత్రో, ప్రధాన్ తదితరులు



పర్లాకిమిడి: దివ్యాంగులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు



పర్లాకిమిడి: దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: దివ్యాంగులకు ప్రభుత్వం అన్నివిధాల తోడ్పాటునందిస్తోందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో జిల్లా సామాజిక సురక్షా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీల్ చైర్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐదుగురికి వీల్‌చైర్స్, 40 మందికి న్యూట్రీషన్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జిల్లా పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, ఫిజియోథెరపిస్ట్ సరోజినీ రైతో, సమర్థ్ దివ్యాంగుల సంస్థ కార్యదర్శి సంతోష్ మహారాణా, రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు నిరంజన్ బెహరాలు పాల్గొన్నారు.

రాయగడ: ప్రతి ఒక్కరూ దివ్యాంగులను గౌరవించాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జిల్లా సామాజిక సురక్ష శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీల్‌చైర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా దివ్యాంగుల మహాసంఘం అధ్యక్షుడు అమరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: దివ్యాంగులను జీవిత భాగస్వాములుగా చేసుకున్న వారికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేస్తామని కొరాపుట్ జిల్లా ఏడీఎం రాజేంద్ర మఝి ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ వీల్ చైర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత భాగస్వామిలో ఒకరికి కాలు పనిచేయకపోతే ఉచితంగా రూ.2.50 లక్షలు అందజేస్తామన్నారు. దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 17 మందికి ఉచిత వీల్‌చైర్లను అందచేశారు. 12 దివ్యాంగ స్వయం సహాయక బృందాలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఎస్ఓ తరుణ్ తపస్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్ టెర్మినల్ ప్రారంభం



అంబేద్కర్ బస్ టెర్మినల్ సముదాయం



ప్రభుత్వ ఆహార కేంద్రం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



చిన్నారుల ఆట స్థలం



తృణ ధాన్యాల ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రం



అంబేద్కర్ గ్యాలరీ

భువనేశ్వర్: స్థానిక బరముండా ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబేడ్కర్ బస్ టెర్మినల్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. విమానాశ్రయాన్ని పోలినట్లు ఈ బస్సు టెర్మినల్ నిర్మితం కావడం విశేషం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని ఆధునిక సౌకర్యాల నడుమ ప్రయాణికులకు సేవలందించే ఈ బస్ టెర్మినస్ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో మైలురాయిగా నిలుస్తుందన్నారు. భువనేశ్వర్ అభివృద్ధి సంస్థ (బీడీఏ) ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఉన్న స్థలంలోనే రూ.180 కోట్లతో 17.32 ఎకరాల విస్తీర్ణంలో ఈ బస్ టెర్మినస్‌ను నిర్మించారు. 2019లోని నవంబర్‌లో ఈ నిర్మాణం పనులు ప్రారంభించారు.

నిత్యం 700 బస్సుల ప్రయాణం

ఈ బస్టాండ్ నుంచి నిత్యం సగటున 30 వేల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తారని అంచనా. వీరి కోసం నిత్యం 700 నుంచి 800 బస్సులకు ఈ ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించారు. పార్కింగ్ సౌకర్యాలు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు మరియు వాణిజ్య ప్రాంతాలను ఈ సముదాయంలో ఏర్పాటు చేసి ఆధునికంగా రూపొందించారు. బహుళ అంతస్తుల కార్ పార్కింగ్, పికప్, డ్రాప్-ఆఫ్ సౌకర్యం, మురుగు నీటి శుద్ధి కర్మాగారం వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. టెర్మినల్ సమగ్రంగా సౌర శక్తితో నడుస్తుంది. బస్టాండ్ ప్రాంగణంలో 44 యాక్టివ్ బస్ బేలు ఉన్నాయి. 5 బేలు సిటీ బస్సు సర్వీసుల కోసం మరియు 111 బస్ బేలు నిష్క్రియ పార్కింగ్ కోసం రిజర్వ్ చేయబడ్డాయి. ఈ ప్రాంగణంలో 100కి పైగా ఆటో రిక్షాలు , 20 టాక్సీలు, 85 ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రైవేట్ కార్లు, బైక్‌ల కోసం 20 చొప్పున పార్కింగ్ స్లాట్‌లు ఏర్పాటు చేశారు.

అంబేద్కర్ గ్యాలరీ ఏర్పాటు

900 చదరపు అడుగుల విస్తీర్ణంలో అంబేద్కర్ గ్యాలరీ నిర్మించారు. దీనిలో ఆయన జీవితం, ఆదర్శాలను ప్రదర్శించడంతో పాటు కొన్ని వస్తువులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంచారు. టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికుల కోసం డార్మిటరీ, డ్రింక్ ఫ్రమ్ ట్యాప్, సామాన్లు భద్రపరిచే గది, ప్రీపెయిడ్ ఆటో సర్వీస్, ఏటీఎం, బేబీ ఫీడింగ్ రూమ్ వంటి సౌకర్యాలు ఉండడం విశేషం. మొదటి అంతస్తులో బహుళ రుచుల ఆహార విక్రయ కేంద్రాలు, మిషన్ శక్తి కేఫే, ప్రభుత్వ ఆహార్ కేంద్రం, మిషన్ శక్తి కియోస్క్, పిల్లల ఆట స్థలం, వెల్‌నెస్ సెంటర్, పోలీసు అవుట్ పోస్ట్, కంట్రోల్ కమాండ్ సెంటర్, ఓటీడీసీ ట్రావెల్ కియోస్క్ వంటి పలు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల కోసం మొత్తం 5 లిఫ్టులు, 2 ఎస్కలేటర్లు ఉన్నాయి. టెర్మినల్ సమగ్రంగా 120 సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో భద్రతా నిఘాలో ఉంటుంది.

చెరువులో పడి యువకుడి దుర్మరణం



చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి ఖిలిమిలి గ్రామంలో చెరువులో పడి ఒక యువకుడు దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తేజ్‌సింగ్ (18)గా గుర్తించారు. ఉత్తరప్రదేశ్ నుంచి కొన్ని కుటుంబాలు బొరిగుమ్మ సమితి ఖిలిమిలి గ్రామంలోని మైదానంలో టెంట్లు వేసుకొని ఉంటున్నారు. వారు వివిధ రకాల వస్తువులు సైకిల్‌పై గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఒకరైన తేజ్‌సింగ్ గురువారం మధ్యాహ్నం తన సోదరితో కలిసి గ్రామ సమీపంలోని చెరువుకి వెళ్లాడు. అతడి సోదరి దుస్తులు ఉతుకుతుండగా చెరువులో స్నానానికి దిగాడు. అయితే దురదృష్టవశాత్తు చెరువులో లోతుగా ఉన్న ప్రాంతంలో మునిగిపోయాడు. అది గమనించిన సోదరి సహాయం కోసం సమీపంలో ఉన్నవారిని పిలిచింది. స్థానికులు వచ్చి వెంటనే బొరిగుమ్మ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి చెరువులో గాలించారు. అతికష్టంపై సాయంత్రం లోతుగా ఉన్న చెరువు నీటిలో తేజ్‌సింగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలిసిన బొరిగుమ్మ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తేజ్‌సింగ్ మృత్యువాత పడడంతో ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చినవారు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

ఈనెల 5న రాష్ట్రంలో పీఎం పర్యటన



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం నగరానికి విచ్చేస్తారు. తెలంగాణ మీదుగా ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి విచ్చేయనున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో జాజ్‌పూర్ జిల్లా చండీఖోల్ వెళ్తారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి పలు ప్రాజెక్టులు ప్రారంభించి, కొత్త ప్రాజెక్టుల కోసం శంకుస్థాపన ఇతరేతర కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు. చండీఖోల్ ప్రాంతంలో కార్యక్రమాలు ముగించుకుని ప్రత్యేక హెలీకాప్టర్‌లో తిరిగి స్థానిక విమానాశ్రయానికి చేరుతారు. ఇక్కడ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా పర్యటనకు బయల్దేరుతారు.

భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత, రక్షణ ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సమీక్షించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్‌సేవా భవన్‌లో బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. స్థానిక విమానాశ్రయంలో ల్యాండింగ్ మొదలుకొని తిరిగి కోల్‌కత్తా వెళ్లేంతవరకు ఆద్యంతం భద్రత, రక్షణ ఏర్పాట్లని అధికారులతో సమీక్షించారు. తెలంగాణ నుంచి ప్రత్యేక విమానంలో స్థానిక విమానాశ్రయం చేరిన వెంటనే ప్రధాని జాజ్‌పూర్ జిల్లా చండీఖోల్ ప్రాంతానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరుతారు. అక్కడ బహిరంగ సభ ఇతరేతర పలు కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు. పర్యటనలో భాగంగా అత్యవసర, ఆకస్మిక బసకు సంబంధించి అనుబంధ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. ప్రధానమంత్రి పాల్గొనే ప్రతీ కార్యక్రమం ప్రాంగణాలు, వేదికల పటిష్ట భద్రత, రాకపోకలు పురస్కరించుకుని కార్కేడ్ ఇతరేతర రవాణా సంబంధిత రక్షణ ఏర్పాట్లు, వీవీఐపీ వర్గాల బాగోగులుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అగ్నిమాపక, ఆరోగ్య, విద్యుత్ ఇతరేతర అనుబంధ శాఖలు, విభాగాల కార్యకలాపాలకు సంబంధించి ముఖ్య కార్యదర్శి ఉన్నతాధికారులతో సమీక్షించారు.

క్విజ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 26 నుంచి జనవరి 1 వరకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రశంసా పత్రాలను అందజేశారు. బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలనువారం రోజులు పాటు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సూర్య కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శతావధానం విజయవంతం చేయాలి



వేదికపై నాగరాజు, రమేష్ ,శ్రీనివాస్ శర్మలు

రాయగడ: ఈనెల 11వ తేదీ నుంచి పట్టణంలో తొలిసారిగా 108 మంది కవి పండితులతో సంస్కృతం, ఆంధ్ర భాషల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శతావధానం కార్యక్రమాన్ని తెలుగువారంతా జయప్రదం చేయాలని ఉత్కళ ఆంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ కోరారు. స్థానిక స్వాగత్ రోడ్డు రామలింగేశ్వర మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఉర్లాంకి చెందిన బంకుపల్లె రమేష్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని శతావధాని బులుసు అపర్ణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి భళ్లమూడి నాగరాజు మాట్లాడుతూ సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి సభాధ్యక్షత వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అవధాని మరుములదత్తాత్రేయ శర్మ వంటి పండితులు పృశ్చకులుగా పాల్గొనున్నారన్నారు.

యువజన కాంగ్రెస్ నిరసన ర్యాలీ



కాంగ్రెస్ భవన్ ఆవరణలో సభలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు



రాజమహల్ కూడలిలో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధికారిక నివాసం నవీన్ నివాస్ ముట్టడికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు విఫలయత్నం చేశారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు ఈ ఆందోళనలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భవన్ దగ్గర బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం రాజ మహల్ కూడలి గుండా నవీన్ నివాస్ ముట్టడికి భారీ ఊరేగింపుగా బయల్దేరారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, వేధిస్తున్న నిరుద్యోగ సమస్యలతో పాటు అక్రమాలు, అవినీతి పెచ్చుమీరి పోయాయనే నినాదాలతో ఊరేగింపు కొనసాగింది. ఈ ఆందోళన అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసు వర్గాలు యువజన కాంగ్రెసు కార్యకర్తలను అడ్డుకున్నారు. బారికేడ్లను దూకేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో అడ్డుకున్న పోలీసులపై యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కోడిగుడ్లు, టమోటాలు రువ్వారు. పరిస్థితిని నియంత్రించేందుకు పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి వెండి బిందె వితరణ



ఆలయ ఈఓ ప్రసాదరావుకు వెండిబిందెను అందజేస్తున్న దాత శ్రీనివాసరావు దంపతులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శ్రీకాకుళం జిల్లాలోని పలాస కాశీబుగ్గకు చెందిన యు.శ్రీనివాస్ దంపతులు శుక్రవారం రూ.37వేల విలువైన వెండి బిందెను బహూకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దాతల సహాయ, సహకారాలతోనే ఆలయ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి సహకారమందించాలని కోరారు. ఈ సందర్భంగా దాతలకు వేదపండితులు వేదాశీస్సులు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, తాళ్లపూడి ధనుంజయ్, దూసి శివప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వలంటీర్ మృతి



నాగరాజు(ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో పదో వార్డు వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిలారి నాగరాజు అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై మృతి చెందాడు. వార్డులో శుక్రవారం పెన్షన్లు పంచేందుకు గురువారం రాత్రి రూ.75వేల నగదును విత్‌డ్రా చేసిన నాగరాజు తెల్లవారేసరికి గున్నతోట వలస వద్ద గల రైలు పట్టాలపై మరణించి ఉన్నాడు. వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబసభ్యులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని, ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా భావిస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన ధర్మాన రాజు(22) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై వైవీ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం రాజు వృత్తిరీత్యా తాపీ పని చేస్తున్నాడు. కుటుంబాన్ని నెట్టుకురావడంలో ఆర్థిక భారంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెంది పురుగు మందు తాగేయడంతో గమనించిన కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడి సోదరుడు ఎర్రంనాయుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగలోని సీతారామ కాలనీకి చెందిన గొంప దుర్గాప్రసాద్ (25) శుక్రవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఓ ఇంట్లో సీలింగ్, విద్యుత్ వర్క్ నిమిత్తం ఉదయం 9 గంటలకు శాంతినగర్ రామమందిరం వద్దకు వెళ్లాడు. విద్యుత్ పని పనిచేస్తున్న సమయంలో షాక్ తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. దుర్గాప్రసాద్ సహచరులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతుని తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబునాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 మద్యం బాటిల్స్ స్వాధీనం

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట జంక్షన్ వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రామచంద్రపేట గ్రామానికి చెందిన రావి గురుమూర్తి 17 మద్యం బాటిల్స్ తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాతారావు తెలిపారు.

పాలకొండలో మరో 12 బాటిల్స్

పాలకొండ రూరల్: మండలంలోని టీకే రాజపురం కూడలి వద్ద పోలీసులు నిర్వహించిన విజిబుల్ పోలీసింగ్‌లో తూడి గ్రామానికి చెందిన ఎం.సాయిసుందర్ అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా సాయిసుందర్ 12 మద్యం బాటిల్స్ తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తంపటాపల్లి, తుమరాడ, రాజుపేట గ్రామాల్లో ఎస్సై పర్యటించారు.

ఏడుగురు పందాలరాయళ్ల అరెస్ట్

గజపతినగరం: మండలంలోని శాలిపేట గ్రామంలో శనివారం రాత్రి కోడిపందాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై యు.మహేష్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. కోడిపందాల రాయుళ్ల నుంచి నాలుగు కోడి పుంజులను రూ.8, 120 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మొబైల్ మోసాలపై అప్రమత్తం

'ఫ్లిప్‌కార్ట్' సంస్థ మెగా డ్రాలో మీరు విన్నర్‌గా నిలిచారు. రూ.12 లక్షల విలువైన కారు గెలుచుకున్నారు. మీకు కారు కావాలా? డబ్బులు కావాలా? అంటూ ఫోన్ కాల్..తర్వాత కార్ అయినా, డబ్బులైనా పొరపాటున అడిగితే..దేనికైనా ఒక శాతం జీఎస్టీ కడితే వెంటనే మీ ఖాతాలోకి లక్షలు జమ అవుతాయంటూ సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించాలని మాయమాటలతో బురిడీ కొట్టించి, మోసం చేస్తున్నారు. ఇటీవలికాలంలో సైబర్ నేరగాళ్లు చేస్తున్న నయా మోసమిది.

- ప్రముఖ కంపెనీల పేర్లతో ఆఫర్స్
- సైబర్ చీటింగ్‌కు పాల్పడుతున్న నేరగాళ్లు
- అవగాహన కల్పిస్తున్న పోలీస్ యంత్రాంగం

విజయనగరం క్రైమ్: మనిషి జీవితం మొబైల్ ఫోన్‌తో ముడిపడిపోయింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకూ ఫోన్ పక్కన ఉంటే చాలన్న భావనే ప్రతి ఒక్కరిదీ. ప్రతి పనీ సెల్‌ఫోన్ ద్వారా అయిపోవడంతో మనిషి టెక్నాలజీకి అలవాటుపడిపోయాడు. అయితే మొబైల్ వాడకం వల్ల లాభమెంత ఉందో..నష్టం కూడా అంగానే ఉందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. ఖాళీగా ఉన్న సమయాల్లో అనవసర మెయిల్స్, లింక్‌లు ఓపెన్ చేయడం, మోసపూరిత ఫోన్‌కాల్స్‌కు సమాధానాలు చెప్పడంతో వారి వివరాలన్నింటినీ సైబర్ నేరగాళ్లు సేకరిస్తూ..ఆఫర్స్ ప్రకటిస్తూ మోసాలకు పాల్పడడం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇటీవలికాలంలో జిల్లాలో పెరుగుతున్న కేసుల సంఖ్యే ఇందుకు సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. ఫోన్‌కాల్ ఏదైనా సరే అప్రమత్తంగా ఉండాల్సింది ప్రజలేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని జిల్లా పోలీసు శాఖ పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ పెడచెవిన పెట్టి మోసపోయిన తర్వాత పోలీసులను ఆశ్రయిస్తున్న సంఘటనలు బాధాకరంగా తయారయ్యాయి.

ఆన్‌లైన్ షాపింగ్ చేసే ప్రముఖ కంపెనీల పేర్లను వాడుకుంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఫోన్ చేస్తున్నారు. పేరు, వివరాలు చెప్పి వారికి ఆఫర్ లెటర్లు వాట్సాప్‌లకు పంపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ప్రధానంగా ఆడవాళ్ల గొంతుతో మాట్లాడిస్తూ వారికి నమ్మకం కలిగించి, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా జీఎస్టీ పేరుతో వేలకు వేలు దోచేస్తున్నారు. ఒకసారి గానీ నమ్మి డబ్బులు పంపిస్తే, మళ్లీ మళ్లీ అవకాశం ఉన్నంత మేరకు నిలువుదోపిడీ చేసి, సెల్ స్విచ్ఛాఫ్ చేసేస్తున్నారు. తీరా మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయితే సంఘటన జరిగిన కొద్దిగంటల్లోనే ఫిర్యాదు చేస్తే వెంటనే బ్యాంక్ అకౌంట్లను నిలువరించే గలిగే పరిస్థితి ఉంటుంది. కానీ రోజులు గడిచిపోతే ఫలితం శూన్యమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సైబర్ నేరాల్లో విజయనగరం జిల్లాలో ఎక్కువగా ఓటీపీ, ఏటీఎమ్ కార్డు మోసాలు, లోన్‌యాప్, ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు జిల్లా పోలీసులు, గ్రామస్థాయిలో మహిళా పోలీసులు స్థానిక పోలీసులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

సైబర్ నేరాలపై 2021లో 106 కేసులు, 2022లో 141 కేసులు, 2023లో 92 కేసులు, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకూ 10 వరకూ కేసులు నమోదైనట్లు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు మహిళా పోలీసులతో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ఏటీఎం కార్డు మోసాలు, ఆన్‌లైన్ జాబ్, ఓటీపీలు చెప్పడంతో జరిగే మోసాల పట్ల డోర్ టు డోర్ వెళ్లి, సైబర్ మోసాలు జరిగే తీరు, లోన్ యాప్‌ల వలన కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు.



రూ.12 లక్షల కార్ లాటరీలో వచ్చిందంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో పంపిన ఆఫర్ లెటర్

- హలో..మేము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయింది. కార్డుపైన ఉన్న నంబర్, పాస్‌వర్డ్ చెప్పండి, మళ్లీ మీ ఏటీఎం కార్డును యాక్టివేట్ చేస్తామంటూ అపరిచిత వ్యక్తినుంచి ఫోన్ కాల్..
- మా సంస్థలో ఉద్యోగానికి మీరు ఎంపికయ్యారు. అయితే ముందుగా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అకౌంట్ నంబర్‌కు గడువులోగా డిపాజిట్ చేస్తే మీకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపిస్తామంటూ ఓ ఫోన్ కాల్..ఇలా వస్తున్న ఫోన్ కాల్స్‌ను నమ్ముతున్న చాలా మంది నిరుద్యోగులు, ఉద్యోగులు, యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు.

అప్రమత్తంగా ఉండాల్సిందే



సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక లావాదేవీలు చేసే ప్రభుత్వ సంస్థల ప్రతినిధులెవరూ ఫోన్‌లో సంప్రదించరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఆఫర్స్ పేరుతో వచ్చే వాటిని నమ్మి మోసపోవద్దు. ఓటీపీలు చెప్పడం వంటివి చేస్తే మీ బ్యాంక్ ఖాతా ఖాళీ అయిపోతుంది. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు, మెయిల్స్, ఫేక్ మెసేజ్‌లకు స్పందించవద్దు. వెంటనే బ్లాక్ చేయాలి. లక్షల రూపాయలిస్తామని, జీఎస్టీ మాత్రమే కడితే సరిపోతుందన్న సైబర్ నేరగాళ్ల మాటలకు గట్టిగా బుద్ధి చెప్పండి. పొరపాటున కూడా వారి వలలో పడవద్దు. జిల్లాలో ప్రత్యేకంగా సైబర్‌సెల్ ఉంది. మోసపోయామన్న బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

చిన్నతరహా పరిశ్రమల నమోదుకు సహకరించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నమోదు కోసం మార్చి 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టిందని జిల్లాలోని అన్ని ఎంఎస్ఎంఈలు ఈ సర్వేలో నమోదు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రిశ్రమల పనితీరును మెరుగుపరచడం, వాటి అభివృద్ధి కోసం ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్రప్రభుత్వం చేపట్టిన ర్యాంప్ పథకంలో భాగంగా పరిశ్రమల నమోదును చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినేట్ సెక్రటరీలు ఆయా సంస్థలకు సర్వే నిమిత్తం వచ్చినప్పుడు పరిశ్రమల యాజమాన్యాలు తగు సమాచారం ఇచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సర్వేకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తయారీ, సేవా, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురావడం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈ పోర్టల్‌కు అనుసంధానం జరుగుతుందని చెప్పారు. నమోదు కాని వ్యాపారాలను ఉద్యమ్, ఉద్యమ్ ఎసిస్ట్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ సంస్థలకు భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం, మార్కెటింగ్ సదుపాయం కల్పించడం కోసం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేయడం కోసం ఈ సమాచారాన్ని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.


మారుమూల ప్రాంతాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటు

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో మొబైల్‌సిగ్నల్స్ అందని మారుమూల ప్రాంతాల్లో సెల్‌టవర్‌లు ఏర్పాటు చేయాలని టెలికాం సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. టవర్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వ పరంగా సత్వరమే మంజూరుచేసి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఎస్.కోట, రామభద్రపురం, గంట్యాడ మండలాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు మొబైల్ సేవలు అందడం లేదని, ఈ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌లేని గ్రామాలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని టెలికాం సంస్థలు ముందుకు వచ్చి టవర్లు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రధాన టెలికాం ఆపరేటర్లతో కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో మొబైల్ టవర్ల ఏర్పాటు, వాటికి అనుమతుల మంజూరుపై సమీక్షించారు. రామభద్రపురం మండలం ఎనుబరువు, ఎస్.కోట మండలం పల్లపు దుంగాడ, గంట్యాడ మండలం దీకేపర్తి తదితర ప్రాంతాల్లో టెలికాం సిగ్నల్ అందడంలేదని, రానున్న ఎన్నికల దృష్ట్యా ఈ గ్రామాల్లో వెంటనే టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మార్చి నెలాఖరులోగా ఎస్.కోట, గంట్యాడ, రామభద్రపురం మండలంలోని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్, రిలయన్స్, జియో సంస్థల్లో ఏ సంస్థ ద్వారా అవకాశం ఉంటే వారితో ఏర్పాటు చేస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, కలెక్టరేట్ ఎన్నిక విభాగం సూపరింటెండెంట్, బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ప్రతినిధులు, ఫైబర్‌నెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోండ్రుపై గాండ్రింపు

- సొంత పార్టీ నుంచి నిరసన సెగ
- టికెట్ ఇవ్వద్దంటూ టీడీపీ మాజీ ఎంపీపీల సమావేశం



కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా సమావేశమైన టీడీపీ మాజీ ఎంపీపీలు

రేగిడి: రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోండ్రు మురళీమోహన్‌కు నిరసనసెగ రోజురోజుకూ అధికమవుతోంది. కొద్దికాలంగా కోండ్రు మురళీమోహన్ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. గత నెలలో రాజాంలో జరిగిన లోకేష్ శంఖారావం సభలో కూడా ఈ వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. ఇవేమీ పట్టించుకోకుండా టీడీపీ అధిష్టానం రాజాం అసెంబ్లీ అభ్యర్థిగా కోండ్రు మురళీమోహన్‌ను ప్రకటించింది. దీంతో ఆ పార్టీకి చెందిన రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రేగిడి గ్రామంలో మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు ఇంటి వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు, వంగర మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, రేగిడి మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, రాజాం మున్సిపాల్టీకి చెందిన సీనియర్ నేత శాసపు కేశవనాయుడు, రాజాం మండలానికి చెందిన దుప్పలపూడి నాగేశ్వరరావు తదితరులతో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు సమావేశమయ్యారు.

భారీ తేడాతో ఓటమి ఖాయం

నియోజకవర్గంలో కోండ్రు మురళీమోహన్‌పై పూర్తిగా వ్యతిరేకత ఉందని, ఆయనకు టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కనీసం పార్టీపరంగా బాధ్యతాయుతమైన కార్యక్రమాలు కూడా ఆయన చేయలేదనే విషయాన్ని తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. సామ్యులుగా ఉన్న వ్యక్తులకు ఇక్కడ టికెట్ ఇవ్వాలని, లేకుంటే భారీ ఓట్లతో ఓడిపోతామని వారంతా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును కలిసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. తమ మనసులో మాట నియోజకవర్గ టీడీపీ తమ్ముళ్ల తరఫున తెలపడం, అప్పటికీ పార్టీ పెద్దలు గౌరవించకుటే తామంతా సొంత నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వివరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే ఈ విషయాలు బయటపడకుండా టీడీపీ నేతలు జాగ్రత్తపడ్డారు. నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీపీలుపట్టుబడుతున్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన లెంక వరహాలు మెడలో పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బాధితురాలు వరహాలు భర్త రామకృష్ణతో కలిసి విజయనగరం మండలం అయ్యన్నపేట గ్రామంలో జరుగుతున్న ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా గొడియాడ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు తెంచి పారిపోయారు. దీంతో బాధితులు గంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలోని పారాది, కొండదేవుపల్లి గ్రామాలకు చెందిన మావిరెడ్డి సూర్యచంద్రరావు, బోరపురెడ్డి ప్రమీలకు రూ.2.5లక్షలు, రూ.2లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే శంబంగి కృషి చేశారు. ఈ మొత్తాలను చెక్కుల రూపంలో శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, పూడి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

నేను మీ వాడిని

- డిప్యూటీ సీఎం రాజన్నదొర
- రూ.4.85 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మూలవలస రోడ్డు ప్రారంభం



బీటీ రోడ్డును ప్రారంభించి గ్రామ ప్రజలతో నడుస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్:

నా తల్లిదండ్రులు అసలైన గిరిజనులు. నేను ఎల్లప్పుడూ మీవాడినేనని డిప్యూటీ సీఎం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజన్న దొర అన్నారు. గిరిజనులను మోసం చేసేందుకు, ఓట్లు దండుకోడానికి నకిలీ గిరిజనులు అబద్ధపు గిరిజనులు మన చుట్టూ తిరుగుతున్నారని జాగ్రత్తగా ఉండాలని గిరిజనులను పిలుపునిచ్చారు. ఈ మేరకు సాలూరు మండలంలోని కొత్తవలస, నార్లవలస, అన్నంరాజు వలస గ్రామాల్లో ఐటీడీఏ నిధులు రూ.4.85 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అలాగే నిర్మాణం పూర్తయిన మూలవలస బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం గొందివలస, సిమిడి వలసల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ వాడిని కాబట్టే నేను వచ్చిన తరువాత మన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన గ్రామాలకు అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. తాను గడపగడపకు వచ్చినప్పుడు ప్రజలు కోరిన మేరకు ఈ రోడ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. టీడీపీ నాయకుల్లా కొబ్బరికాయలు కొట్టి పనులు గాలికి వదిలే నాయకత్వంలో తాము లేమని సంక్షేమానికి మారుపేరుగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

మీరంతా నాకుటుంబం. మీకోసం నేను చేసిన అభివృద్ధి, జగనన్న అందిస్తున్న సంక్షేమం మీ కళ్ల ముందు కనిపోస్తోంది. ఇంతకంటే మీకు ఏం కావాలి. జగనన్నను మళ్లీ మనమందరం కలిసి ముఖ్యమంత్రిని చేద్దాం. అందరూ సిద్ధంగా ఉండండి అని కోరారు. అంతకు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ టీడీపీ నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఓట్లు దండుకునేందుకు గంగిరెద్దుల టీమ్‌లా వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. రాజన్నదొర హయాంలోనే గిరి శిఖర గ్రామాలకు బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమాల్లో మూలవలస సర్పంచ్ బేటుకూరి రామ్మూర్తి, ఐటీడీఏ డీఈ మణిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునికతతో మంచి అవకాశాలు



లెండి ఇంజనీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా ఎంఓయూ పత్రాలను చూపిస్తున్న సంస్థ డైరెక్టర్ యుక్తేష్, ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి తదితరులు

డెంకాడ: ఆధునిక సాంకేతికతకు అవసరమైన అంశాలను నేర్చుకోవడం వల్ల ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలో మంచి అవకాశాలు పొందవచ్చని విశాఖ ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ నర్రా సురేష్ అన్నారు. ఈ మేరకు లెండి ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇంటెర్జ్ సహకారంతో ప్లేస్‌మెంట్ సెల్ నిర్వహించనున్న 72 గంటల పాటు హ్యాకథాన్ హ్యాక్‌ట్రియాడ్ శుక్రవారం సందడిగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్రా సురేష్ మాట్లాడుతూ 72 గంటల పాటు హ్యాక్‌థాన్ హ్యాక్‌ట్రియాడ్ చాలెంజ్‌లో విద్యార్థులు పాల్గొనడం వల్ల ఎంతో ప్రయోజనమని చెప్పారు. వార్‌రూం వాతావరణంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఆలోచన, పని సంస్కృతిని సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా డైరెక్టర్ చింతమండక యుక్తేష్ మాట్లాడుతూ హ్యాక్‌ట్రియాడ్ అనేది సృజనాత్మక,జట్టు కృషిని నిర్ణీత వ్యవధిలో సమస్యను వేగవంతంగా పరిష్కరించే డైనమిక్ ప్లాట్‌ఫాం అని తెలిపారు. అనంతరం విషయ విజ్ఞాన పరిశోధన కోసం తరచూ సవాళ్లను నిర్వహించడానికి లెండి ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా ఎంవోయూ కుదుర్చుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు,సెక్రెటరీ కోడూరు శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ టి.హరిబాబు, కేవీ నరసంహం, ప్లేస్‌మెంట్ డీన్స్ జి.ప్రకాష్‌బాబు, హెచ్‌వోడీలు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన

- మొదటిస్థానంలో నిలిచిన నెక్కలవానిపాలెం ఎడ్లు



ఉల్లాసంగా దౌడు తీస్తున్న ఎడ్లు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో శ్రీనందీశ్వరస్వామి తీర్థం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అంతర్‌జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీల్లో 16 జతలు ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వరుసగా శ్రీ పైడితల్లమ్మతల్లి (నెక్కలవానిపాలెం), గండి వెంకటరావు (వాయిల్పాడు), శ్రీ సిద్ధివినాయక (వల్లంపూడి), ముమ్మన శివతేజ (నరసయ్యపేట), పరవాడ నాయుడు (అదనగిరి), పోలిపర్తి నాయుడు (కలగాడ)లకు చెందిన ఎడ్లబళ్లు వరుసగా విజయం సాధించాయి. విజేతలకు 12, 8, 6, 4, 2 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ముందుగా నందీశ్వరుడిని చట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.అనంతరం రాత్రి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి అభినందన



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: ప్రథమ శ్రేణిలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా అన్ని సబ్జెక్టుల్లో బంగారు పతకాలు సాధించిన చీపురుపల్లి పట్టణానికి చెందిన కందుల దుర్గాప్రసాద్‌ను వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు అభినందించారు. పట్టణంలోని ఆంజనేయపురంలో నివాసం ఉంటున్న కందుల భాస్కరరావు, రజని దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీబీఎస్ తాజాగా పూర్తి చేశాడు. అయితే దుర్గాప్రసాద్ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించడంతో వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, కేజే.శ్రీనివాసరావు, కింతలి మధు, ఎస్‌వీజీ.శ్రీనివాసరావు, సూరుకుమార్, సుంకరి తిరుమల, అందవరపు హరిప్రసాద్, అందవరపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు



విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పార్వతీపురం:

రానున్న లోక్‌సభ, శాసనసభ సాధారణ ఎన్నికల్లో విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కును వినియోగించుకోవడంలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎ.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగించుకోవడంపై స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన సదస్సు జిల్లా ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారిణి కె.కవిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎ.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఓటు నమోదు చేసుకోవడంతో పాటు వినియోగించుకోవడం ఓటరు బాధ్యత అని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం దివ్యాంగులకు సాక్ష్యం యాప్‌ను రూపొందించిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుందని చెప్పారు. పోలింగ్ రోజున సులభతరంగా ఓటు వేసేందుకు దివ్యాంగులకు ప్రత్యేకమైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు.

పోలింగ్ సెంటర్‌కు రాలేకుంటే ఇంటి నుంచే ఓటు

పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులను గుర్తించి వారు ఇంటి నుంచి ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేశారని చెప్పారు. ఓటు నమోదు చేసుకోని వారుంటే ఫారం 6, అలాగే తప్పులను సరిచేసుకోడానికి ఫారం 8ను ఉపయోగించుకునేలాగా ఆలైన్ ద్వారా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని వివరించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారిణి కె.కవిత ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ 18 సంవత్సరాలు దాటిన దివ్యాంగులంతా ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులతో ఓటు హక్కు సద్వినియోగంపై నినాదాలు చేయించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.